## జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా వి.పూర్ణ చంద్రరావు బాధ్యతల స్వీకరణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా వి.పూర్ణచంద్రరావు శుక్రవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల అరెస్టు

**శెనార్తి మీడియా, కరీంనగర్**

రెండు వేర్వేరు చోరీ ఘటనల్లో నిందితులను కరీంనగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేయగా.. వారి నుంచి 250 గ్రాముల బంగారం, రూ.10లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీపీ గౌస్ ఆలం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రెండు ఘటనల్లో నిందితుల వివరాలు వెల్లడించారు. కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలోని బస్టాండులో చిగురుమామిడి మండలం నవాబ్‌పేటకు చెందిన కంది సంపత్‌రెడ్డి(48) ఫిబ్రవరి 14న ఒక మహిళ బ్యాగు నుంచి 16.5 తులాల బంగారం, ఫిబ్రవరి 24న కరీంనగర్ బస్టాండుకు వచ్చి ఒక మహిళ బ్యాగు నుంచి 47 గ్రాముల బంగారం, ఏప్రిల్ 8న ఒక వృద్ధుడి బ్యాగు నుంచి రూ.13లక్షలు దొంగిలించాడు. ఈ మూడు ఘటనలపై కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు సంపత్‌రెడ్డిని కమాన్ చౌరస్తా వద్ద సీఐ కోటేశ్వర్ బృందం పట్టుకొని అరెస్టు చేశారు. అతడి వద్ద నుండి 150 గ్రాముల బంగారం, రూ.10లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో కరీంనగర్ టూటౌన్ పరిధిలో ఈనెల 13న సప్తగిరికాలనీలో ఒక ఇంట్లోకి వరంగల్ జిల్లా నర్సంపేట మండలం అశోక్‌నగర్‌క్ చెందిన సూర రవి(35) అనే నిందితుడు చొరబడి 175 గ్రాముల బంగారు ఆభరణాలతోపాటు రూ.35వేల నగదు



అపహరించుకుపోయాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు రవిని పద్మనగర్ చౌరస్తా వద్ద శుక్రవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 100 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు బిల్ల కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, సీసీఎస్ సీఐ బొల్లం రమేశ్ పాల్గొన్నారు. సిబ్బంది కుమార్, అనిల్‌రెడ్డి, సురేందర్‌పాల్, మల్లయ్య, సాయికుమార్‌తో పాటు పలువురిని ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందించారు.

# భూభారతితో భూసమస్యలకు పరిష్కారం




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టాన్ని తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి, తాండూర్, కన్నెపల్లి మండల కేంద్రాల్లోని కన్నాల రైతు వేదికలో ఈ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు భూ హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేస్తోందని తెలిపారు. భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేసే ముందు సర్వే నిర్వహించి మ్యాప్ సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. పెండింగ్ లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించనున్నట్లు చెప్పారు. విరాసత్ ప్రక్రియలో సమగ్ర విచారణ చేపట్టి, వారసులకు నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. పాసుపుస్తకాల్లో భూమి పటం వివరాలను చేర్చడం, భూ సమస్యల పరిష్కారానికి అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేయడం వంటి అంశాలు చట్టంలో ఉన్నాయి. భూధార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి తీసుకున్న భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములపై పట్టాలను రద్దు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 30 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టంపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. జూన్ 2 వరకు ఎంపిక చేసిన మండలాల్లో సమస్యలు పరిష్కరించి, మిగిలిన మండలాల్లో ఆగస్టు 15 లోగా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామస్థాయిలో భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత సర్వేయర్లు, అధికారుల నియామకంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పట్టాభూమి, లావుని పట్టాలు, ఇతర భూసమస్యలు చట్టం ప్రకారం పరిష్కరిస్తామని, టైటిల్, పొజెషన్ సంబంధిత కోర్టు కేసులను మినహాయించి మిగతావన్నీ పరిష్కరించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జోత్స్న, మండల వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, కన్నెపల్లి తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రామచందర్, టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, ఏఎంసీ చైర్మన్ చింత స్వామి, వైస్ చైర్మన్ కంకటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గాగిల్లాపూర్ లో వ్యవసాయ కళాశాల స్థాపనకు స్థల పరిశీలన



**శెనార్తి మీడియా, మానకొండూర్**

గాగిల్లాపూర్‌లో వ్యవసాయ కళాశాల స్థాపనకు స్థల పరిశీలనప్రభుత్వం నుంచి వంద ఎకరాల భూమి కేటాయింపు, రూ.100 కోట్లతో నిర్మాణాల లక్ష్యంమానకొండూర్ నియోజకవర్గంలోని బెజ్జంకి మండలానికి చెందిన గాగిల్లాపూర్ గ్రామంలో వ్యవసాయ గురుకుల కళాశాల ఏర్పాటు కోసం శుక్రవారం అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనూ చౌదరి, సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి అలుగు వర్షిణి, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఈ పరిశీలనలో పాల్గొన్నారు. కళాశాలకు కేటాయించిన వంద ఎకరాల భూమిని పరిశీలించి, భవనాల నిర్మాణానికి అనుకూలమైన ప్రదేశాలను ఎంచుకునే దిశగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలలకు సంబంధించిన పాలనా అనుమతులు ఇప్పటికే లభించాయని, మే నెలలో భూమిపూజ నిర్వహించి భవన నిర్మాణాలను ప్రారంభించాలన్న ఉద్దేశంతో త్వరలో టెండర్లు పిలవాలని సూచించారు. నిర్మాణాలు నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడతగా రూ.47 కోట్లు మంజూరుకానున్నట్లు తెలిపారు.గతంలో సిద్దిపేట డిగ్రీ కాలేజీలో ప్రారంభమైన బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుకు యూనివర్సిటీ గుర్తింపు లేక విద్యార్థులు అయోమయంలో పడిన విషయాన్ని గుర్తు చేస్తూ, సాంఘిక సంక్షేమ వ్యవసాయ కళాశాలకు తాజాగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. దీంతో ప్రస్తుతం కోరుట్లలో కొనసాగుతున్న కళాశాలను బెజ్జంకికి తరలిస్తున్నట్టు స్పష్టం చేశారు.స్థల పరిశీలనలో కాంగ్రెస్ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్ రెడ్డి, చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, చెప్యాల శ్రీనివాస్ గౌడ్, బైరి సంతోష్, నర్సయ్య, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లిలో సీపీఐ గ్రామ శాఖ ఎన్నిక

**శెనార్తి మీడియా, గన్నేరువరం:** గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ మండల సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ ఎన్నికలు నిర్వహించగా, బోయిని తిరుపతిని గ్రామ శాఖ కార్యదర్శిగా, కల్వల రాజును సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంపత్, కిష్టయ్య, తిరుపతి, బచ్చంటి రామయ్య, ఆంజనేయులు, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.



## చెన్నూర్ ఠాణా తనిఖీ..

**శెనార్తి మీడియా, చెన్నూర్**

చెన్నూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో మాబ్ ఆపరేషన్ డ్రిల్ చేపట్టి, సంఘవిద్రోహ శక్తులు గుంపులుగా గుమిగూడిన సందర్భంలో వారిని ఏ విధంగా చెదరగొట్టాలో పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు.అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించి, విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. ధైర్యంగా, ఆత్మస్థైర్యంతో విధులు నిర్వహించాలంటూ సూచనలు చేశారు. కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ దేవేందర్ రావు, ఎస్సై సుబ్బారావు, ఎస్సై వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు ఇంటికొకరు తరలిరావాలి

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న**

**శెనార్తి మీడియా, గన్నేరువరం**



బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఇంటికొకరు తరలి రావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ అని, బీఆర్ఎస్ పార్టీతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని అన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి లో బీఆర్ఎస్ రజతోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారని తెలిపారు. ప్రతి పల్లె నుంచి ఇంటికొకరు దండులా సభకు తరలిరావాలని కోరారు. ఆవిర్భావ సభ మరో అధ్యాయాన్ని సృష్టించబోతున్నదన్నారు.

## కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలి:

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** వేమనపల్లి మండలానికి చెందిన ఆదివాసి నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టాగ్స్) డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో సంఘం నేతలు మాట్లాడారు. కన్నయ్య మరణానికి కారణమైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కన్నయ్య కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు, భూమి ఇవ్వాలని కోరారు. కార్యక్రమం లో బాధితురాలు నాయిని స్వరూప, నేతలు మరమల శంకర్, దాసరి రాజేశ్వరి, సామల ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానశాస్త్రంపై ఆసక్తి పెంపొందించే శిబిరం ప్రారంభం

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

- **విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించిన కలెక్టర్ కుమార్ దీపక్**



వేసవి సెలవులను సార్థకంగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో జిల్లా శాస్త్ర కేంద్రంలో వేసవి సైన్స్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్ విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ప్రశ్నలు అడిగి, సమాధానాల ద్వారా శాస్త్రీయ అవగాహన పెంపొందించేలా వారిని ఉత్సాహపరిచారు. ప్రతి వస్తువు వెనక శాస్త్ర సూత్రాలు ఉన్నాయన్న సంగతి గుర్తుంచుకోవాలి. వాటిని తెలుసుకోవడమే నిజమైన విజ్ఞానం. ఈ శిబిరం ద్వారా విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుంది. పాఠ్యాంశాలతో పాటు ప్రాయోగిక పరిజ్ఞానం చాలా ముఖ్యం అని కలెక్టర్ అన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా తల్లిదండ్రులు పిల్లల రాకపోకల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జిల్లా శాస్త్ర అధికారి మధుబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 186 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 120 మందికి అవకాశం కల్పించామని తెలిపారు. శిబిరంలో విద్యార్థులకు వినూత్న ప్రయోగాలు, పరిశీలనల ద్వారా శాస్త్ర పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ... ఈ శిబిరం మాకు కొత్త విషయాలు నేర్పుతోంది. ఈ సెలవులను నేర్చుకునే అవకాశంగా మలచుకుంటున్నాం. ఇక్కడ పొందిన జ్ఞానాన్ని భవిష్యత్‌లో వినియోగిస్తాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, మంచిర్యాల మండల విద్యాధికారి మాలవీదేవి, కార్యాలయ పర్యవేక్షకులు సత్యనారాయణ, కోడింగ్ నిపుణులు సాల్మన్ జోన్స్, ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, శ్రీమూర్తి, నాగవర్మ, రాజేశం, తిరుపతి, జిజ్ఞాస సభ్యులు లక్ష్మణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ స్ఫూర్తితో ఓరుగల్లుకు దండై కదలుదాం

- **బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ ఏల శేఖర్ బాబు**

**శెనార్తి మీడియా, గన్నేరువరం**



"తెలంగాణ సాధన కోసం 14 సంవత్సరాల పాటు సాగిన ఉద్యమాన్ని ఎలాగైతే ప్రజల భాగస్వామ్యంతో ముందుకు నడిపామో, ఇప్పుడు అదే ఉద్యమ స్ఫూర్తితో ఓరుగల్లు సభ వైపు దండై కదలుదాం," అని మానకొండూరు బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ ఏల శేఖర్ బాబు పిలుపునిచ్చారు.ఈ నెల 27న మండలంలోని ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేసి, ఊరూరా బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఓరుగల్లు సభకు తరలిరావాలని సూచించారు. "పోయింది కేవలం అధికారమే, కానీ ప్రజల గుండెల్లో గులాబీ జెండా ఎప్పటికీ ఎగిసిపోతూనే ఉంటుంది. కేసీఆర్ గారు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాయి," అని అన్నారు.ఓరుగల్లు సభకు తెలంగాణ నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరుకానున్నారని, కేసీఆర్ గారి మాట వినాలనే తహతహతో ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

## అగ్ని ప్రమాదంలో 50వేల విలువ చేసే పంట దగ్ధం..

- **కంటతడి పెట్టిన కౌలు రైతు రమేష్ కుటుంబ సభ్యులు..**
- **బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలి**



**శెనార్తి మీడియా, చిగురుమామిడి**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు 50వేల రూపాయల విలువచేసే వరి పంట దగ్ధమైనట్లు బాధిత కౌలురైతు పోతుల రమేష్ కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు.ఈ సందర్భంగా రైతు రమేష్ మాట్లాడుతూ బొమ్మనపల్లి గ్రామానికి చెందిన సుకోషి రాజయ్య,రవీందర్ లకు చెందిన రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని అప్పులు చేసి పంట సాగు చేశానని చెప్పారు.రాత్రనక పగలనక కష్టపడి సాగునీటిని పొదుపు చేస్తూ పంటను పండించానని, పంట కోసేందుకు హార్వెస్టర్ తో వెళ్ళగా అగ్నిప్రమాదానికి గురై పంట కాలిపోయిందని గుండెలు విలిసేలా రైతు రోదించారు.కోసేందుకు సిద్ధంగా ఉన్న 20గుంటల సీడ్ వరి,కోసి పక్కన పెట్టిన వరి కాలిపోయిందని తీవ్ర కన్నీరు మున్నీరుగా విలపించారు.అగ్ని ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కానుగంటి సత్యనారాయణ రెడ్డి,బద్దిపడగ మల్లికార్జున్ రెడ్డి,సుకోషి సమ్మయ్యలు మండుటెండలో అక్కడికి వెళ్లి బాధిత రైతు కుటుంబ సభ్యులను ఓదార్చారు.మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి బాధిత రైతు రమేష్ ను ఆదుకునేలా తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.మండల ఆర్ ఐ అరుణ్ కుమార్,వ్యవసాయ విస్తరణ అధికారి అఖిల బాధిత రైతు పొలం వద్దకు వెళ్లి కాలిపోయిన పంటను పరిశీలించి రైతుకు భరోసా కల్పించారు.అగ్ని ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారణ చేసి పేదకౌలు రైతుకు న్యాయం చేయాలని తోటి రైతులు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు మరల పునరావృత్తం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బొమ్మనపల్లి,రేకొండ గ్రామస్తులు కోరుతున్నారు.